క్లుప్తంగా

బాల్య వివాహాలు అరికట్టాలి

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించి బాలల హక్కుల పై అవగాహన కల్పించారు. డీసీసీయూ కౌన్సిలర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాల్యవివాహాలను అరికట్టాలని సూచించారు. బాలురుతో పాటు బాలికలను చదివించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి. శ్రీదేవి, షేక్ మస్తాన్ బీ.హెచ్ఎం కె.అపర్ణ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇక్కుర్రులో సహకార వారోత్సవాలు



నరసరావుపేట రూరల్: మండలంలోని ఇక్కుర్రు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో శనివారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వర్లు పాల్గొని సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. సొసైటి అభివృద్ధికి అందరూ కృషిచేయాలని ఆయన తెలిపారు. సంఘం అభివృద్ధి చెందినప్పుడే రైతులకు అన్ని రకాల సౌకర్యాలు సంఘం నుంచి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ బొడ్డపాటి పేరయ్య, జనసేన నాయకులు బొడ్డపాటి శేషయ్య, సీఈవో కంటు శ్రీనివాసరావు, పలువురు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలపై అవగాహన సదస్సు



వినుకొండ (నూజెండ్ల): వినుకొండ రూరల్ పరిధిలో గోనుగుంట్లవారిపాలెం గ్రామంలో ఉన్ననటువంటి అంగన్‌వాడీ సెంటరులో చిన్నారులకు స్క్రీనింగ్ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా సీడీపీవో ముదివర్తి అనురాధ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ సెంటరు చేరినటువంటి చిన్నారులు అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించటం వలన ప్రారంభ దశలో వ్యాధులు లోపాలు వైకల్యం, శారీరక ఎదుగుల తదితర వాటిని మెరుగుపరచటానికి దోహదపడుతుందన్నారు. ఆరోగ్యకరమైన చిన్నారులు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. వైద్య ఆరోగ్య అధికారులు సమస్యలను గుర్తించి చికిత్స ప్రణాళికలు రూపొందిస్తారన్నారు. అంగన్‌వాడీ సెంటరులో చిన్నారులకు ఎత్తు, బరువు, పోషకాహార సమస్యలను అధిగమించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతినెలా చిన్నారులకు వైద్య ఆరోగ్య నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి రామ్ నాయక్, సెంటరు కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఎస్‌బీఐ ప్రథమంగా నిలుస్తోంది

ఎస్‌బీఐ గుంటూరు డీజీఎం శ్రీకృష్ణకుమార ప్రభు



చిలకలూరిపేటటౌన్: సామాజిక సేవా కార్యక్రమాల్లో భారతీయస్టేట్‌బ్యాంక్ ఎప్పుడు ముందుంటుందని బ్యాంక్ గుంటూరు డీజీఎం శ్రీకృష్ణకుమార ప్రభు చెప్పారు. పట్టణంలోని కళామందిర్ ఎస్‌బిఐశాఖ ఆధ్వర్యంలో మండలంలోని మురికిపూడి గ్రామం జెడ్పీహైస్కూల్లో సీఎస్ఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యతోనే విద్యార్థి ఉన్నతి ముడిపడి ఉంటుందన్నారు. ఒంగోలు ప్రాంతీయ కార్యాలయ అధికారి ఎస్.గున్నేశ్వరరావు మాట్లాడుతూ గురువులు విద్యా, క్రమశిక్షణతో పాటు విద్యార్థులకు సామాజిక సేవపట్ల అవగాహన కల్పించాలని కోరారు. చిలకలూరిపేట శాఖ మేనేజర్ పీవీ రమణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం బ్యాంక్ ఆధ్వర్యంలో ఫర్నిచర్, కంప్యూటర్స్, వాటర్ కూలర్‌లను పాఠశాల హెచ్ఎం ధనలక్ష్మికి అందజేశారు.

మొక్కలు పంపిణీ

నరసరావుపేట రూరల్: మిద్దె తోటల పెంపకంలో మహిళలు ఆసక్తి చూపిస్తున్నారని ప్రకృతి వ్యవసాయ విభాగం మేనేజర్ కె.అమల కుమారి తెలిపారు. కాకతీయనగర్ మిద్దెతోట గ్రూపుసభ్యుడు శివరామకృష్ణ నివాసం వద్ద శనివారం మిద్దె తోటకు అవసరమైన 70నుంచి 85 రకాల మొక్కల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమానికి స్పెషల్ బ్రాంచ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బంఆరు సురేష్‌బాబు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయంలో మిద్దె తోటల పెంపకానికి మహిళలు ముందుకు రావాలని తెలిపారు.

రైతులను భయపెడుతున్న వాతావరణం

వరి రైతుల్లో ఆందోళన

- ఇలాగే వాతావరణం కొనసాగితే నష్టమేనంటూ ఆవేదన
- చర్యలు చేపడితే తెగులు బారి నుంచి బయటపడొచ్చంటూ అధికారుల సూచన



చిరుపొట్ట దశలో ఉన్న వరిపైరు



కంకులు ఈనుతున్న వరిపైరు



చాకలికుంట తండా, ఎడ్వర్డ్‌పేట గ్రామ పొలాల్లో కోతకు సిద్ధమవుతున్న వరిపైరు

రొంపిచర్ల: వాతావరణంలో గత ఐదు రోజులుగా వస్తున్న మార్పులకు వరి రైతాంగం ఆందోళనకు గురౌతుంది. గత ఏడాది సాగు నీరు లేక వరి సాగు లేకపోవడంతో మాగాణి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండలంలో ఉన్న పంట భూముల్లో 75 శాతం మేర మాగాణి భూములు ఉన్నాయి. 40 వేల ఎకరాల వరకు పంట భూములు ఉండగా 30 వేల ఎకరాలు మాగాణి భూములు ఉన్నాయి. ఈ ఏడాది సార్వాలో 25 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే ఈ వరి సాగు మూడు విడతలగా సాగింది. మొదటి విడతగా వాగులు, వంకలు, బావులు, చెరువులు, బోర్ల క్రింద సెప్టెంబర్ మొదటి వారంలో ఎడ్వర్డ్‌పేట, చాకలికుంట తండా, కొత్తపల్లి, విప్పర్ల, మర్రిచెట్టుపాలెం, దాసరిపాలెం, రెడ్డిపాలెం, మాచవరం గ్రామాల్లో 5 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ పైరు ప్రస్తుతం కంకి దశలో ఉంది. అలాగే రెండవ విడతగా సెప్టెంబర్ చివరి వారంలో, అక్టోబర్ మొదటి వారంలో మండలంలో మరో 10 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే ఈ పైరు అంతా ప్రస్తుతం పొట్ట దశలో, కంకులు వచ్చే దశలో ఉంది. మరో 10 వేల ఎకరాల్లో పిలకలు తొడిగే దశలో ఉంది. వరి నారుమళ్ల సాగు మొదలు గత మూడు రోజుల క్రితం వరకు వాతావరణం, వర్షాలు వరి సాగుకు అనుకూలంగా ఉంది. అయితే ప్రస్తుతం నెలకొన్న వాతావరణం వరి పంటకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదటి విడతలో సాగు చేసిన వరి పైరు నవంబర్ నెలాఖరుకు కోతలకు వస్తాయి. ఈ పరిస్థితుల్లో వర్షాలు కురిస్తే పైరు నేలవారి దెబ్బతింటోందని ఆందోళన మొదురు వరి రైతుల్లో నెలకొంది. రెండవ విడతగా సాగు చేసిన వరి పైరు పొట్ట, కంకులు వచ్చే దశలో ఉంది. ఈ పరిస్థితుల్లో వర్షం పడితే వరి పొట్టల్లోకి నీరు పోవడం, వరి కంకులకు మానుకాయ వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చివరి విడతగా సాగు చేసిన వరి పంటకు నష్టం అంతగా లేనప్పటికీ తేమ వాతావరణం వల్ల మచ్చ తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. ఈ తరుణంలో మూడవ విడతలో సాగు చేసిన బీపీటీ రకం వరి వంగడాలకు అగ్గి తెగులు కూడా ఆశించే అవకాశాలు మెండుగా కనపడుతున్నాయి. ఇప్పటి వరకు చీడ పీడలు స్వల్పంగా ఉండి వరి పైరు ఎదుగుదల ఆశాజనకంగా ఉండటంతో అనుకున్నమేర దిగుబడులు వస్తాయని రైతులు అభిప్రాయ పడుతున్న తరుణంలో ఈ వాతావరణం రైతుల ఆశలపై అనుమానాలను రేకెత్తిస్తుంది. ప్రస్తుతం తుఫాన్ ప్రభావం వల్ల మూడురోజులుగా ఆకాశం మేఘావృతమై అడపా, దడపా వర్షపు జల్లులు కురుస్తున్నాయి. ఇంతటితో వర్షాలు ఆగి వాతావరణంలో ఎప్పటిలా మార్పులు వస్తే రైతుల ఆశలు ఫలిస్తాయని మాగాణి రైతాంగం ఆశాభావం వ్యక్తం చేస్తుంది.

11 ఎకరాల్లో వరి సాగు చేశా



ఈ ఏడాది 11 ఎకరాల్లో పది రోజుల వ్యవధిలో వరి నాట్లు పూర్తి చేశా. ప్రస్తుతం 6 ఎకరాల వరి పైరులో కంకులు వస్తుండగా, మరో ఐదు ఎకరాల్లో వరి పైరు బిర్రుపొట్టపై ఉంది. ఈ వాతావరణం ఈలాగే కొనసాగితే మానుకాయ ఆశించే అవకాశం ఉంది. ఇంతటితో వాతావరణం పొడిబారితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అనుకున్న మేర ధాన్యం దిగుబడులు వస్తుంది.

– చెన్నారెడ్డి, రైతు, వి.రెడ్డిపాలెం

వరి పైరుకు మానుకాయ వచ్చే అవకాశం



ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల్లో పొట్ట దశలో ఉన్న వరి పైరుకు మానుకాయ తెగులు వచ్చే అవకాశం ఉంది. ఈ తెగులు నివారణకు రైతులు ముందు జాగ్రత్త చర్యగా కార్బండిజమ్, మ్యాంకోజబ్ కామినేషన్ మందును పిచికారి చేసుకొని ఈ తెగులు నుంచి పైరును రక్షించుకోవచ్చు. లీటర్ నీటికి రెండు గ్రాముల మందు చొప్పున ఎకరాకు 500 గ్రాముల మందును పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు.

–శివలలిత, వ్యవసాయ అధికారి

సృజనతో కూడిన విద్య అందించడమే లక్ష్యం



చిలకలూరిపేట: సృజనతో కూడిన విద్య అందించటమే సృజన శనివారం కార్యక్రమ లక్ష్యమని ఎంసీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.సుధ చెప్పారు. పాఠశాలలో సృజన శనివారాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో కాగితపు ఇళ్లు, గ్రీటింగ్‌కార్డులు, చిలుకల తయారీ వంటి కార్యక్రమాలు నిర్వహింపచేశారు. విద్యార్థులతో అభ్యుదయ గీతాలు పాడించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా తోటకు పోదాం, పరిశుభ్రత, చదువుకుందాం వంటి కార్యక్రమాలు నిర్వహింపచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి శ్రీనివాసరావు, ఎ.నీలిమ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ సోమవారం నుంచి నెల రోజుల పాటు 181వ ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు శిబిర నిర్వాహన బోధక యోగాచార్యుడు జల్లి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ప్రకాష్‌నగర్ రిక్షాసెంటర్ సమీపంలోని మాగులూరి వెంకటరెడ్డి బిల్డింగ్, అక్షర స్కూల్ ఆవరణలో ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7గంటల వరకు శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణలో భాగంగా 42 యోగాసనాలు, ఆహార నియమాలు, సూర్య నమస్కారాలు, ధ్యానం, ప్రాణాయామం తదితర అంశాలను బోధించనున్నట్లు తెలిపారు. శిక్షణా శిబిరానికి 8 నుంచి 80 సంవత్సరాల వయస్సు వారు హాజరు కావచ్చన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

డీఈఓ చంద్రకళ



విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం స్వీకరిస్తున్న డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: పాఠశాలకు తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి హాజరు శాతం పెరిగేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ప్రకాష్ నగర్‌లోని శ్రీతిలక్ మున్సిపల్ పాఠశాలను శనివారం సందర్శించిన డీఈఓ చంద్రకళ ఎస్ఐఎంఎస్ యాప్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరగతి విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించి నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు, పాఠశాల హెచ్ఎం కుంభా నరసింహారావు పాల్గొన్నారు.

రాఫ్టింగ్ క్యాంప్‌నకు ఎన్‌ఈసీ విద్యార్థులు



నరసరావుపేట రూరల్: కర్ణాటకలోని బెల్గామ్‌లో ఈనెల 17నుంచి 25 వరకు జరిగే వైట్ వాటర్ రాఫ్టింగ్ క్యాంప్‌నకు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికైనట్టు కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు శనివారం తెలిపారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.శివరాజ్‌కుమార్, సిహెచ్ మణికుమార్, షేక్ నసీమ్‌లు ఎంపికైన వారిలో ఉన్నారని తెలిపారు. మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించాలి, శారీరక దృఢత్వాన్ని పెంచుకోవడం, ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపర్చుకోవడం, టీం వర్క్ వంటి అంశాలపై శిబిరంలో శిక్షణ ఇస్తారని వివరించారు. క్యాంప్‌కు ఎంపికై న క్యాడెట్స్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు, విభాగాధిపతులు డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ వెంకటరావు, డాక్టర్ వీవీఎస్ లక్ష్మీ, డాక్టర్ శర్మ, అధ్యాపకులు అభినందించారు.

నేడు యోగిరెడ్డిసేవా సమితి కార్తిక వనసమారాధన

వినుకొండ (నూజెండ్ల): నేడు యోగివేమారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన వేడుకలు నిర్వహించుతున్నట్లు సేవా సమితి అధ్యక్షులు ఆరా శివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తిక వన సమారాధన వేడుకలు పట్టణంలో వెల్లటూరు రోడ్డు మార్గంలో ఉన్ననటువంటి సేవా సమితి ప్రాంగణంలో నిర్వహించుతామన్నారు. ఈ కార్యక్రమానికి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టరు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంటు కన్వీనర్ మోదుగుల వేణుగోపాలరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు. మహిళలకు ఆటల పోటీలు, పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు, సంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని రెడ్డి కమ్యూనిటీ వర్గీయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలోజక్కిరెడ్డి సుబ్బారెడ్డి, సంజీవరెడ్డి, ప్రముఖ న్యాయవాది చెన్నకేశవరెడ్డి, ములక రామతులసిరెడ్డి, సోము వెంకటేశ్వరరెడ్డి, తుమ్మల వెంకటరెడ్డి, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి నియంత్రణ దిశగా చర్యలు

వైద్యాధికారి రాధాకృష్ణన్

శావల్యాపురం: క్యాన్సర్ వ్యాధి పూర్తిస్థాయిలో నియంత్రణ చేయటానికి ఎన్‌సీడీ సర్వే ఎంతోగానో దోహదపడుతుందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ప్రారంభ దశలో గుర్తిస్తే ప్రభుత్వ పరంగా ఉచితంగా వైద్యసేవలు అందిస్తే వ్యాధి నివారణ చేయవచ్చునన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లోని వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి దీర్ఘకాలక వ్యాధులైన బీపీ,షుగర్,థైరాయిడ్, ఆహారపు అలవాట్లు, రోజు తీసుకునే ఆహారం గతంలో ఉన్ననటువంటి వ్యాధులు గురించి ప్రస్తుతం ఆరోగ్య స్థితిగతులు తదితర వివరాలన్నీ తెలుసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. ఈసర్వే కార్యక్రమం మూడు నెలల పాటు జరుగుతుందన్నారు. ప్రతి రోజు 5 మంది సమగ్ర వివరాలను ఎత్తు, బరువు, నడుం కొలత, బీపీ, హిమోగ్లోబిన్ వైద్య పరీక్షలు చేసిన అనంతరం ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. సర్వే పనులు పారదర్శకంగా చేయాలని పురోగతి వేగవంతం చేయాలన్నారు. సర్వే పనుల్లో ఆలసత్వం వహించిన ఆరోగ్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌సీడీ సర్వేకు ప్రజలందరు వైద్య ఆరోగ్య సిబ్బందికి సహకరించాలన్నారు.

జేఎన్‌టీయూఎన్ విద్యార్థులకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రొఫెసర్ శ్రీనివాసరావు, జీపీ రాజు

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూకె అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీలలో జేఎన్‌టీయూ నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఆరు బంగారు పతకాలు సాధించినట్టు కళాశాల వ్యాయామ సంచాలకులు డాక్టర్ జీపీ రాజు శనివారం తెలిపారు. ఈనెల 11,12 తేదీలలో కాకినాడ జిల్లా సూరంపాలెంలోని అదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 12వ జేఎన్‌టీయూకె అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీలలో ఎలక్ట్రికల్ బ్రాంచ్ నాల్గవ సంవత్సరం విద్యార్థిని నందిని 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారుపతకం, తృతీయ సంవత్సరం సివిల్ బ్రాంచ్ విద్యార్థి ఎం.పవన్‌కుమార్, పి.వంశీ, ఎ.దుర్గాప్రసాద్, బి.రత్నకిషోర్‌లు రిలే విభాగంలో బంగారు పతకాలు సాధించినట్టు వివరించారు. బి.నందిని యూనివర్సిటీ పరిధిలో ఫాస్టెస్ట్ ఉమెన్‌గా అవార్డు తీసుకున్నట్టు తెలిపారు. ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో జరిగే ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలలో నందిని 100 మీటర్ల పరుగులో వర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ వైఎస్ కిశోర్‌బాబు, అసోసియేట్ ప్రొఫెసర్ ఆచార్య జీపీ రాజు, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

విద్యార్థులూ.. పఠనాసక్తిని పెంచుకోండి

కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త



క్విజ్ విజేతలు బహుమతులు అందిస్తున్న విజయ కుమార్, సుబ్బరాయ గుప్త

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు పఠనాసక్తిని పెంచుకొని ప్రతిరోజు గ్రంథాలయాన్ని సందర్శించాలని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని కళాశాల గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను శనివారం వారు ప్రారంభించారు. గాంధీ జీవిత చరిత్ర, తెలుగు సాహితీ మూర్తుల జీవిత విశేషాలు, రచనలు తెలియచేసేలా ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను వారోత్సవాలు పూర్తయ్యే వరకు పట్టణంలోని విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, గ్రంథాలయాధికారి పి.రామాంజనేయ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో...

పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులచే ప్రతిజ్ఞ నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా లైబ్రరీ సైన్స్ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్, గ్రంథాలయోద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ అధ్యక్షత వహించిన ఆయా కార్యక్రమాలలో రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, అభ్యుదయ భారతి అధ్యక్షుడు రత్నాకరం రాము, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం

నాదెండ్ల: పుస్తక పఠనంతో మనిషిలో జ్ఞానం, వ్యక్తిత్వం పెంపొందుతాయని గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రమైన నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు అర్పించారు. వారి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో వేలాది పుస్తకాలు జ్ఞానాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని, విద్యార్థులు, యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకుని విజ్ఞానవంతులుగా ఎదగాలన్నారు. సెల్‌ఫోన్ కాలక్షేపాన్ని వీడి పుస్తక పఠనం అలవర్చుకుంటే జీవిత వికాసానికి దోహదపడుతుందన్నారు. ఆదివారం కవి సమ్మేళనాలు, సెమినార్‌లు, పలువురు రచయితల సందేశాలు, అనంతరం వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబశివరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖా గ్రంథాలయాల్లో శనివారం గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేసిన ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి వారు గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఎస్.ఆర్. రంగనాథన్, వెంకటరమణ, పాతూరి నాగభూషణంలు గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపాధ్యాయుడు సుందరరాజు మాట్లాడుతూ చిరిగిన చొక్కా తొడుక్కున్నా పరవాలేదు, మంచి పుస్తకం చదవాలన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు రాంజేంద్రప్రసాద్, సుభాని, పడాల చక్రారెడ్డి, గ్రంథాల అధికారులు సుబ్బారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కోస్తాంధ్ర నుంచే గ్రంథాలయ తొలిఉద్యమం

యడ్లపాడు: రాష్ట్రంలోని కోస్తా ఆంధ్రా నుంచి గ్రంథాలయ ఉద్యమం తొలిగా ప్రారంభమైందని సున్నా హనుమంతరావు చెప్పారు. యడ్లపాడు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం కొనసాగాయి. ముందుగా గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్యన్, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముత్తవరపు సాంబయ్య విద్యార్థులకు మాదక ద్రవ్యాలను గురించి వివరించారు. వ్యసనాలకు బానిసలై జీవితాలను బలి చేసుకోవద్దని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సీహెచ్ అంజమ్మ, గ్రామపెద్దలు జి శివరామకృష్ణ, తాళ్లూరి నాగేశ్వరరావు, సంజీవరావు, శివమ్మ, రామదాసు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

●ముందు గొయ్యి.. చూసి అడుగువెయ్యి!



గణపవరం-కావూరు వెళ్ళే దొంక రోడ్డు వెంపలబాబాయ్ చెరువు మూల వద్ద రహదారి పక్కనే పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదభరితంగా మారింది. ఈ రహదారిపై రాకపోకలు సాగించే వాహనచోదకులు గుంతలో పడి గాయాలపాలౌతున్నారు. రాత్రి వేళల్లో భారీ వాహనాలు గొయ్యిలో ఇరుక్కుని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల రహదారి మరమ్మత్తులు నిర్వహించారు. అయితే దీన్ని మాత్రం మరిచారు. గతంలో చిన్న గుంతగా ఉండగా, ఇటీవలి భారీ వర్షాలకు నాలుగు అడుగుల లోతు గొయ్యిగా మారింది. ఈ రహదారి గుండా గణపవరం మీదుగా పలు గ్రామాలకు ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్ల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. గొయ్యిని పూడ్చి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు.

–నాదెండ్ల

●ఉన్నతికి విద్య తప్పనిసరి

సత్తెనపల్లి: ఆడపిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్య తప్పనిసరి అని హెచ్ఎం ఉమా దేవి అన్నారు. కంటెపూడి గ్రామ ఎంపీపీ పాఠశాలలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు శనివారం నిర్వహించారు.

ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను జయప్రదం చేయండి

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం బనాయించిన కుట్ర కేసులకు అన్యాయంగా పదేళ్ల పాటు జైలుపాలై తీవ్ర అనారోగ్యంతో ఇటీవల అమరుడైన కామ్రేడ్ ప్రొఫెసర్ జీఎన్.సాయిబాబా సంస్మరణ సభ ఆదివారం ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ప్రజాసంఘాల నాయకులు వెల్లడించారు. ఈ మేరకు శనివారం స్టేషన్‌రోడ్డులోని గాంధీపార్కు వద్ద సంస్మరణ సభకు చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు. దీనిలో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక జిల్లా కన్వీనర్ ఏ.వీరాంజనేయులు, విరసం నాయకులు జి. కళ్యాణ్‌రావు, పౌర హక్కుల సంఘం నాయకులు చిలుకా చంద్రశేఖర్, సీపీఐ నాయకులు ఎం.వెంకయ్య, పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కొంగర నరసింహం పాల్గొని ప్రసంగిస్తారని వెల్లడించారు. దీనిలో పాల్గొని జయప్రదం చేయాలని సీనియర్ నాయకులు కోరారు.